క్లుప్తంగా

ఒంటె వాహనంపై సంజీవరాయుడు



ఒంటె వాహనంపై సంజీవరాయస్వామి ఊరేగింపు

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్వ్రత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరాయ స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, హోమం తదితర పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంపై ఆశీనులను చేసి ఊరేగించారు. ఆలయ ఈఓ బీవీ నరసయ్య, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ్ రాధా, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



కొలువు దీరిన అభయాంజనేయస్వామి విగ్రహం

రాజుపాళెం : వెల్లాల క్షేత్రంలో 15 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్టించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు అర్చకుడు పవన్ చేశారు. ఆలయ ఈఓ బీవీ నరసయ్య, ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన మధు అనే భక్తుడు సహకారంతో అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు.

రేపు అగస్త్యేశ్వరాలయంలో చండీహోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు లోక కల్యాణార్థం చండీ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఇన్‌చార్జి ఈఓ శంకర బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 7 గంటలకు గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అగస్త్యేశ్వరస్వామి, రాజ రాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక తమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఈడెం లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుందా నాగరాజు, ప్రధాన కార్యదర్శి గంగారపు రాధాకృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడు తిప్పాబత్తిన గోపాలదాసు, పల్లా విశ్వేశ్వరయ్య, కోశాధికారి ఉమ్మడిశెట్టి నందగోపాల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో దేవాంగకల్యాణ మండపం, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం, ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, కార్యదర్శి కాటం రామకృష్ణ, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు వుట్టి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి మచ్చా వెంకట సుబ్బరాయుడు, కోశాధికారి వెంకటాచలపతి, గంగా జలందర్, మనోహర్, వెంకట లక్షుమయ్య, దేవాంగ కుల ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాశిరెడ్డినాయన ఆరాధన

ఖాజీపేట : భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఖాజీపేట మండలం పత్తూరులో ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయంలో ఏటా వైభవంగా ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తారు. 25వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 25న ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేయనున్నారు. రాత్రి చెంచులక్ష్మి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. 26వ తేదీ కాశిరెడ్డి నాయనకు మహానైవేద్య ప్రసాదం సమర్పణ, ప్రత్యేక పూజలు చేయనున్నారు.

సర్వలోక రక్షకుడు యేసు



బద్వేలు అర్బన్ : విద్యుద్దీపాలంకరణలో కలసపాడు ఆర్సీఎం చర్చి



బద్వేలు అర్బన్ : విద్యుద్దీపాలంకరణలో సీఎస్ఐ చర్చి



ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యుత్ దీపాలంకరణలో ఆర్సీఎం చర్చి

బద్వేలు అర్బన్ : యేసుక్రీస్తు జననం లోకానికి వెలుగని, సర్వలోక రక్షకుడని పునీత ఆంతోనివారి దేవాలయం విచారణ గురువులు రెవ. ఫాదర్ ఆరోగ్య రాజ్ పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకలలో భాగంగా ఆదివారం స్థానిక పునీత ఆంతోనివారి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పశువులపాకలో బాలయేసును పూజించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రిస్మస్ పండుగ ప్రతి సంవత్సరం ప్రపంచానికి ఒక పాఠం నేర్పుతూనే ఉంటుందన్నారు. క్రీస్తుజన్మదినం సర్వ మానవాళికి ఎంతో సంతోషదాయకమని, దేవుడే మానవుడై లోకంలో అవతరించడం ఎంతో శుభపరిణామమని అన్నారు. ప్రజలందరూ శాంతితో యేసు క్రీస్తును ఆదర్శంగా తీసుకొని ప్రేమ కలిగి జీవించాలన్నారు. అనంతరం దివ్య బలిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సహాయక గురువులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో..

పట్టణంలోని సుమిత్రానగర్‌లో ఉన్న పరిపాలు పట్టణ దేవాలయం (సీఎస్ఐ చర్చి)లో క్రిస్మస్ సందర్భంగా ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఆవరణలో క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనా మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేసి శిలువ దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సీఎస్ఐ చర్చి డీనరీ చైర్మన్ ఎం.ఎఫ్.ఎస్.ఆనందబాబు క్రీస్తు సందేశం అందించారు. అలాగే నెల్లూరు రోడ్డులోని ఫాతిమామాత చర్చిలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమాల్లో విచారణ గురువులు రెవ. ఫాదర్ విజయరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దైవసందేశం ఇచ్చారు.

ముస్తాబైన చర్చిలు


కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని పరిపేతురు పరిపాలు చర్చి, ఆర్సీఎం చర్చిలు క్రిస్మస్ పండుగ సందర్భంగా సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్‌దీపాలు, రంగురంగు కాగితాలతో చర్చిలను అలంకరించారు. చర్చి ఆవరణలో బాల యేసు, క్రిస్మస్‌ట్రీలను ఏర్పాటు చేశారు. క్రీస్తు జననానికి గుర్తుగా క్రైస్తవులు వారి వారి ఇళ్ల వద్ద స్టార్లను ఏర్పాటు చేసుకున్నారు. క్రైస్తవులు అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ముందుగా నిర్వాహకులు చర్చిల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

కాశినాయన : క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో చర్చిలను సుందరంగా అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుండి క్రీస్తు జననం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు క్రైస్తవులు ముమ్మరంగా ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి నుంచి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. మండలంలోని అమగంపల్లె చర్చిలో క్రిస్మస్ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రిస్మస్‌ను పురస్కరించుకుని స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్‌పీజీ-1, గోకుల్ నగర్‌లోని ఎస్పీజీ-2, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3, బొల్లవరంలోని ఆర్‌సీఎం, వైఎంఆర్ కాలనీలోని గోల్డన్ జూబ్లి తదితర అన్ని చర్చిలను నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు. రంగులు వేయడంతోపాటు విద్యుత్ దీపాలు, అలంకరణ వస్తువులు, శిలువలు, క్రిస్మస్‌ట్రీ తదితర సెట్టింగ్‌లతో అలంకరించారు. కొన్ని చర్చిల వద్ద క్రీస్తు జన్మవృత్తాంతం తెలిపే పశువుల పాకలను ఏర్పాటు చేశారు. చర్చిల ముందు సీరియల్ లైట్లు, క్రీస్తు ఆర్చీలు ఏర్పాటు చేశారు. మందిరాల లోపల పూల అలంకరణ చేశారు. కొన్ని చర్చిలలో ఆదివారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సోమవారం ఉదయం క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలను క్రైస్తవులు, విశ్వాసులు చేయనున్నారు. ఇందుకోసం అన్ని చర్చిల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



బద్వేలు అర్బన్ : బాలయేసును పూజిస్తున్న విచారణ గురువులు ఫాదర్ ఆరోగ్యరాజ్

సేవే బైబిల్ సారాంశం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సేవ చేయడం, క్షమించడం, ప్రేమించడం బైబిల్ సారాంశం అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక బొల్లవరంలోని టీసీసీ చర్చి వద్ద క్రిస్మస్‌ను పురస్కరించుకుని పోరెడ్డి సుజాత ఫౌండేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి 300 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బైబిల్‌ను చదవడం కాదు పాటించిన వారే నిజమైన క్రైస్తవులని చెప్పారు.

ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. పోరెడ్డి నరసింహారెడ్డి మూడేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. ఒకటో వార్డు పరిధిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పోరెడ్డి స్పందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ తనను ఆదరిస్తున్న వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తన సతీమణి పోరెడ్డి సుజాత పేరుతో ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది క్రిస్మస్ సందర్భంగా చీరెల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో మిగిలిన స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పందిటి సరోజమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, గుమ్మళ్ల పద్మ, కౌన్సిలర్ కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

వైఎస్సార్ పెళ్లి కానుక పంపిణీ

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన చింతోటి రాజేష్, మేకల సుచిత్ర, ఎర్రమాస్ దినకర్, పొట్టిపాటి బ్యూలా దంపతులకు వైఎస్సార్ పెళ్లి కానుక పథకం ద్వారా రూ.లక్ష చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని దంపతులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ పందిటి సరోజమ్మ, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరినగర్‌కాలనీలో చీరలు పంపిణీ

పోరుమామిళ్ల : స్థానిక గిరినగర్‌కాలనీలో ఆదివారం సాయంత్రం జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా సంస్థ ప్రతినిధి ప్రసాదరెడ్డి ద్వారా మహిళలకు చీరలు పంపించారు. ఆ చీరలు జెడ్పీటీసీ చేతుల మీదుగా మహిళలకు అందించారు. క్రిస్మస్‌కు కొత్త చీరలు అందుకోవడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.



చీరలు అందచేస్తున్న జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీనివాసనగర్‌లోని గ్రేస్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా 250 మంది నిరుపేదలకు ఆదివారం నూతన వస్త్రాలతోపాటు ఆహార ప్యాకెట్లు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ 32 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయమ్మ, అల్బర్ట్ దంపతులను అభినందించారు. ఉద్యోగాలను వదులుకుని సేవే లక్ష్యంగా వారు ముందుకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం సురేష్, అరసం జిల్లా అధ్యక్షుడు నాగులారపు విజయసారథి, నిర్వాహకులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న బంగారు మునిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

గణితాన్ని ఇష్టంతో అభ్యసించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : గణితాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో అభ్యసించాలని కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని గణితఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్తూరు జిల్లాకు చెందిన గణిత ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ తన శిష్య బృందంతో నిర్వహించిన గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో తమ అద్భుత జ్ఞాపక శక్తితో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులకు గణిత దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థిని గీతిక(ప్రొద్దుటూరు), ద్వితీయ, తృతీయ బహుమతులను సమాన మార్కులతో రామ్‌చరణ్ జెడ్పీహెచ్ఎస్ (పలుగురాళ్లపల్లి), తేజస్విని జెడ్పీహెచ్ఎస్ (బాలికల)(ఎర్రగుంట్ల), నాలుగు, ఐదు స్థానాల్లో సమాన మార్కులతో వరలక్ష్మి జెడ్పీహెచ్ఎస్(మైలవరం), భార్గవ జెడ్పీహెచ్ఎస్(నల్లపురెడ్డిపల్లె)లు నిలిచారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులతోపాటు ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ మెంబర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్ గౌరవాధ్యక్షుడు ఇమాం హుసేన్, డివిజన్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం, కోశాధికారి సంజీవ రెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని గీతికకు బహుమతి అందజేస్తున్న ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి

గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రేణిగుంటలో నిర్వహించిన జోన్-4 క్రీడల్లో ప్రతిభ చాటారని పీఈటీ అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. రేణిగుంట గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన జోన్-4 క్రీడల్లో అజయ్‌నాయక్ చెస్‌లో ప్రథమ స్థానం, 200 మరియు 400 మీటర్ల పరుగుపోటీల్లో తృతీయ స్థానం సాధించారన్నారు. అలాగే వెంకటేష్ చెస్‌లో తృతీయ స్థానం పొందాడన్నారు. కాళహస్తి ఎమ్మెల్యే మధుసూధనరెడ్డి చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్ అందుకున్నారని అనిల్ తెలిపారు. ఇరువురు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారన్నారు.



మెడల్, సర్టిఫికెట్ ఇస్తున్న కాళహస్తి ఎమ్మెల్యే

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో బాలికలు



ప్రతిభ కనపరచిన క్రీడాకారులతో నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్-14, -16 విభాగాల్లో బాలబాలికలకు 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, బ్రాడ్ జంప్, జావెలిన్‌త్రో తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా తరపున గుజరాత్‌లో జరగనున్న నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నారు. పోటీలను బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా, వ్యాయామ అధ్యాపకులు వెంకటసుబ్బయ్య, లక్ష్మి, అంకారావు, శ్రీనివాసులు, ఓబయ్య, ప్రణవి, నాగేశ్వరరావు, రామాంజి తదితరులు పర్యవేక్షించారు.

చుక్కల భూముల సమస్యకు పరిష్కారం

ఖాజీపేట : చుక్కల భూముల సమస్య పరిష్కారం అవుతుందని, రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఖాజీపేట మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవ రెడ్డి అన్నారు. ఖాజీపేట మండలంలో చుక్కల భూముల సమస్య కారణంగా చాలా మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్ముకునేందుకు వీలు లేకుండా, కొనేందుకు సమస్య గా మారింది. ఈ విషయమై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సహకారంతో సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకు పోయామన్నారు. సీఎం స్పందించి కడప కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. కలెక్టర్, ఆర్డీఓ చొరవ కారణంగా సమస్య పరిష్కారం అయ్యిందన్నారు. రైతులు వెంటనే తమ సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేపర్ బొమ్మల తయారీపై శిక్షణ

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం లైబ్రరీకి వచ్చిన విద్యార్థులకు పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్ కొండా ప్రసాదరెడ్డి పేపర్‌తో బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ మాట్లాడుతూ విద్యార్థులు సెలవు రోజుల్లో లైబ్రరీకి రావడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ఏదో ఒక కళపై ఇక్కడ శిక్షణ పొందటం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. లైబ్రరీలో పుస్తకాలు చదవటం జ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అఫ్రిది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల కొవ్వొత్తుల ర్యాలీ

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి రాజీవ్ సర్కిల్ మీదుగా పుట్టపర్తి సర్కిల్ వరకు ఏఐటీయూసీ, సీఐటీయూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మంజుల, జనసేన నాయకుడు జిలాన్ అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు సుబ్బలక్ష్మి, విజయ, గీత, నిర్మల, రామసుబ్బమ్మ తదిరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి అంగన్వాడీలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

రేపు మహా గురుకుల పాఠశాల భవనాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని తోట్లపల్లె దగ్గర రూ. 21 కోట్లతో నూతనంగా నిర్మించిన మహాగురుకుల పాఠశాల భవనాలను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిలు ప్రారంభించనున్నారు. జిల్లాలో మొదటగా మహాగురుకులం బ్రహ్మంగారిమఠం మండలంలో ఏర్పాటు చేశారు. ఈ మహా గురుకులంలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో చదువుతోపాటు వసతి కల్పించనున్నారు. పాఠశాల భవనాల ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.